

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 03-05-2026 | సంపుటి - 27 | సంచిక -341 | రూ : 4 | పేజీలు: 8


# వచ్చే 4 రోజులు వానలు

- మోస్తరు నుంచి భారీ వర్షా లు పడే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- రాష్ట్రంలో తగ్గుముఖం పట్టిన పగటి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ : రాష్ట్రంలో ఆదివారం నుంచి బుధవారం వరకు చాలా జిల్లాల్లో మోస్తరు వర్షం, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న

తరువాయి 2లో





## మే 10న వరంగల్‌కు ప్రధాని మోదీ

# మెగా పార్క్ ప్రారంభోత్సవం

- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.6,000 కోట్లకు పైగా పెట్టుబడులు.. 24,400 మందికి ఉపాధి అంచనా
- 1,327 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిర్మాణం
- 'ఫామ్ టు ఫారెన్' (5F) లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన

2లో



## బెంగాల్‌లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్..

# భారీగా ఓటింగ్ నమోదు

- పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్
- సాయంత్రం 5 గంటలకే సగటున 86.90 శాతం పోలింగ్ నమోదు
- తుది పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారుల అంచనా
- కేంద్ర, రాష్ట్ర బలగాల భారీ భద్రత మధ్య పోలింగ్ ప్రక్రియ పూర్తి
- మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి

2లో

## ఉద్యోగులకు..

# రేవంత్ 'నాలుగు' వరాలు

- ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు కీలక హామీలు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు, 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి

2లో





## చత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలుడు:

# ముగ్గురు జవాన్ల వీరమరణం

- ఈ ఘటనలో ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మృతి, మరొకరికి గాయాలు
- డీమైనింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ దుర్ఘటన
- మావోయిస్టులు గతంలో అమర్చిన బాంబుగా పోలీసుల అనుమానం

2లో

## అమ్మలా పరిణితి చెందుతానంటే

# ఎగతాళి చేశారు: కవిత

- రాష్ట్రంలో అన్ని వర్గాల రక్షణే తమ పార్టీ ధ్యేయమన్న కవిత
- తాము అధికారంలోకి వస్తే పూర్తి ఉచిత విద్యను అందిస్తామని హామీ
- ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యం అందిస్తామన్న కవిత

2లో




## ఉప్పల్‌లో క్రికెట్ సందడి

# ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ వివరాలివే!

- రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్
- లారీలు, రాకెట్ లారీలు, డంపర్లు, ఎర్త్ మూవర్లు, ట్రక్కుల మళ్లింపు
- మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు

2లో



# ఉప్పల్‌లో క్రికెట్ సందడి.. ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ వివరాలివే!

హైదరాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా నేడు ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. మ్యాచ్ ఉండటంతో ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ కారణంగా ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేస్తున్నారు. లారీలు, రాకెట్ లారీలు, డంపర్లు, ఎర్త్ మూవర్లు, ట్రక్కులు, టిప్పర్లు, వాటర్ ట్యాంకర్లు, ఆర్‌ఎంసీ వాహనాలు, జేసీబీలు, ఐషర్ వ్యాన్లు, ప్రైవేటు బస్సులు, ట్రాక్టర్లను అటు రాకుండా మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నేడు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నాగోల్ నుంచి హబ్సిగూడ, బోడుప్పల్ నుంచి అంబర్‌పేట వరకు మోస్తరు ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. ఈ కారణంగా ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు**

ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వచ్చే హెవీ వాహనాలు మెహఫిల్ హోటల్ వద్ద ఉప్పల్ భగాయత్ ప్రవేశద్వారం వద్ద నాగోల్ మీదుగా ఎల్బీనగర్ వైపు మళ్లించబడతాయి. ఎల్బీనగర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకుని హెచ్‌ఎండీఏ భగాయత్ టయోటా యూటర్న్ బోడుప్పల్ చెంగిచెర్ల ఐవోసీఎల్ చెర్లపల్లి ఘట్‌కేసర్ వైపు మళ్లిస్తారు. తార్నాక నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను హబ్సిగూడ క్రాస్ రోడ్డు వద్ద నాచారం ఎన్‌ఎఫ్‌సీ రోటరీ ఐవోసీఎల్ చర్లపల్లి ఘట్‌కేసర్ వైపు మళ్లిస్తారు. రామంతాపూర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను వీధి నెంబర్ 8 వద్ద హబ్సిగూడ క్రాస్ రోడ్డు నాచారం ఎన్‌ఎఫ్‌సీ రోటరీ ఐవోసీఎల్ చర్లపల్లి ఘట్‌కేసర్ వైపు మళ్లిస్తారు. వరంగల్ నుంచి ఉప్పల్ మీదుగా హైదరాబాద్ వచ్చే భారీ వాహనాలను ఘట్‌కేసర్ ఆర్ఆర్ వద్ద ఓఆర్ఆర్ మీదుగా అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్బీనగర్ దిల్‌సుఖ్ నగర్ మీదుగా మళ్లిస్తారు. హైదరాబాద్ నుంచి ఉప్పల్ మీదుగా వరంగల్ వెళ్లే భారీ వాహనాలను ఎల్బీనగర్ హయత్ నగర్ మీదుగా అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ మీదుగా వరంగల్ చేరుకోవాలి.

**పార్కింగ్ ప్రదేశాలు**

ఈ మ్యాచ్ కోసం ఐదు పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేశారు. వీటిలో నాలుగు స్టేడియం బయట 500 మీటర్ల పరిధిలో సాధారణ ప్రజలకు, స్టేడియం లోపల వీవీఐపీ, వీఐపీ పాస్ హోల్డర్లకు ఒక పార్కింగ్ ప్రాంతాన్ని కేటాయించారు. ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి హబ్సిగూడ వైపు పెంగ్విన్ (1), టీజీఐఏఎల్ఏ (2), ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి రామంతాపూర్ వైపు డీఎస్ఎల్ ఓపెన్ ప్రదేశం (3), మోడర్న్ బేకరీ (4) పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశారు.

# వచ్చే 4 రోజులు వానలు

హైదరాబాద్ : రాష్ట్రంలో ఆదివారం నుంచి బుధవారం వరకు చాలా జిల్లాల్లో మోస్తరు వర్షం, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెదర్ రిపోర్టులో వెల్లడించారు. ఆదివారం, సోమవారాల్లో కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి. ఈ మేరకు ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఐదో తేదీన మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఆరో తేదీన నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ రెండు రోజుల పాటు మిగతా అన్ని జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో వర్షం పడొచ్చు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలున్నాయి. శనివారం రాష్ట్రంలో ఎండలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైనే పగటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

**ఉష్ణోగ్రతల వివరాలు**

నిజామాబాద్ 44.0 డిగ్రీలు
ఆదిలాబాద్ 43.8 డిగ్రీలు
మెదక్ 43.6 డిగ్రీలు
రామగుండం 43.0 డిగ్రీలు
ఖమ్మం 42.8 డిగ్రీలు
మహబూబ్‌నగర్ 42.8 డిగ్రీలు
హైదరాబాద్ 41.5 డిగ్రీలు

# బెంగాల్‌లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్.. భారీగా ఓటింగ్ నమోదు

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయింది. కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ ప్రక్రియ జరిగింది. సాయంత్రం 5 గంటల సమయానికి 15 బూత్‌లలో కలిపి సగటున 86.90 శాతం ఓటింగ్ నమోదైంది. మగ్రాహత్ (పశ్చిమ) నియోజకవర్గంలోని 11 బూత్‌లలో 86.11 శాతం, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 బూత్‌లలో 87.60 శాతం పోలింగ్ నమోదైనట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. తుది గణాంకాలు తేలిన తర్వాత పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రీపోలింగ్‌లో ఇది చాలా అధికమని వారు పేర్కొన్నారు. ఈసారి రెండు దశల్లో (ఏప్రిల్ 23, 29) జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 93 శాతం పోలింగ్ నమోదై స్వాతంత్ర్యం తర్వాత కొత్త రికార్డు సృష్టించింది. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్ చాలా వరకు... 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికి, బీజేపీ అధికారంలోకి వస్తుందని అంచనా వేసిన విషయం తెలిసిందే.

# ఉద్యోగులకు.. రేవంత్ 'నాలుగు' వరాలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో శనివారం జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

**జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు**

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

*** 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు**

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

**పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం**

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**రెండు నెలలకోసారి సమావేశం**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు. "ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

# చత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలుడు ముగ్గురు జవాన్ల వీరమరణం

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు గతంలో అమర్చిన శక్తిమంతమైన ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) పేలడంతో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మందుపాతరలు తొలగించే ఆపరేషన్ (డీమైనింగ్) నిర్వహిస్తుండగా శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, కాంకేర్ నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా బలగాలు డీమైనింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు చేపట్టాయి. ఇందులో భాగంగా ఛోటే బేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందం మావోయిస్టులు అమర్చిన బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒక ఐఈడీ ఊహించని విధంగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే అక్కడికక్కడే మృతి చెందారు. మరో కానిస్టేబుల్ పర్మానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడగా, అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం స్పందించారు. "ఇటీవలి కాలంలో లొంగిపోయిన మావోయిస్టులు, నిఘా వర్గాల సమాచారంతో వందలాది ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశాం. కానీ, నేటి దురదృష్టకర ఘటనలో ఓ ఐఈడీని నిర్వీర్యం చేస్తున్న సమయంలో అది పేలింది" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసం డీఆర్‌జీ దళాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మార్చి 31న రాష్ట్రాన్ని సాయుధ మావోయిస్టు రహితంగా ప్రకటించిన తర్వాత ఇదే మొదటి పేలుడు కావడం గమనార్హం.

# మే 10న వరంగల్‌కు ప్రధాని మోదీ.. మెగా పార్క్ ప్రారంభోత్సవం

తెలంగాణలోని వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఈ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇవాళ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి సమీకృత టెక్స్‌టైల్ హబ్‌గా ఈ పార్కును తీర్చిదిద్దినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ పార్కు ద్వారా టెక్స్‌టైల్ తయారీ, ఉపాధి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ '5F' (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారెన్) దార్శనికతకు అనుగుణంగా టెక్స్‌టైల్ విలువ గొలుసును బలోపేతం చేసేందుకు ఈ పార్కును అభివృద్ధి చేసినట్లు వివరించారు. దాదాపు 1,327 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ పార్కు దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,695.54 కోట్లు కాగా, దీని ద్వారా రూ. 6,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు ఖరారైనట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్కులోని 62 శాతం స్థలాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ మెగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత 24,400 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దాదాపు 2,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని కిషన్ రెడ్డి తెలిపారు. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటి పనులు పూర్తయ్యాయని, 232 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 12 MLD నీటి సరఫరా వ్యవస్థ, వ్యర్థ జల శుద్ధి ప్లాంటు (CETP) వంటి కీలకమైన మౌలిక సదుపాయాల పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణలోని వరంగల్‌తో పాటు తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు.

# అమ్మలా పరిణితి చెందుతానంటే ఎగతాళి చేశారు: కవిత

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త రాజకీయ శక్తిగా 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)ను ఆవిష్కరిస్తూ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడిన ఆమె, రాష్ట్రంలోని అన్ని వర్గాల రక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలకు 'అమ్మలా' ఆలోచించే హృదయం లేదని కవిత విమర్శించారు. "నేను అమ్మలా పరిణితి చెందుతానని అంటే చాలా మంది ఎగతాళి చేశారు. కానీ అమ్మలా లాలించి పాలన చేసినప్పుడే ప్రజలకు అసలైన న్యాయం జరుగుతుంది" అని ఆమె స్పష్టం చేశారు. సామాన్యుడి ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యానికే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేసిన కవిత, తమ పార్టీ అధికారంలోకి వస్తే విప్లవాత్మక మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు పూర్తి ఉచిత విద్యను అందిస్తామని, దీనికి సంబంధించిన ఆర్థిక ప్రణాళిక తమ వద్ద సిద్ధంగా ఉందని వెల్లడించారు. తమ ప్రభుత్వం వస్తే... క్యాన్సర్ వంటి మహమ్మారి సోకితే నిరుపేదలు ప్రాణాలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎంత ఖర్చైనా సరే ప్రభుత్వమే భరించి ప్రతి బిడ్డకు నాణ్యమైన వైద్యం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి



కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు విడుస్తుండటం తనను కలచివేసిందని కవిత అన్నారు. ధాన్యం ఎగుమతి కోసం ప్రత్యేక కమిటీ వేసి రైతులకు మద్దతు ధరతో పాటు ఆత్మగౌరవం కల్పిస్తామన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. 1845 ఏళ్ల యువతకు వారి ఐడియాలజీ ఆధారంగా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామని ప్రకటించారు. సచివాలయం వంటి భారీ కట్టడాల్లో వికలాంగుల కోసం కనీసం ర్యాంప్‌లు, ప్రత్యేక టాయిలెట్లు లేకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణం కల్పించకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు.

# ఉపాధ్యాయులకు సింగపూర్ టూర్.. లోకేష్ హర్షం

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు. "ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది" అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# నీట్-యూజీ పరీక్ష: విద్యార్థులూ... ఇవి గుర్తు పెట్టుకోండి!

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ఈరోజు జరగనున్న నీట్ యూజీ పరీక్షకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. నీట్ పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ అమలులో ఉంటుంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక పబ్లిక్ నోటీసు విడుదల చేశారు. ఈ నోటీసు ప్రకారం, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమికూడటం నిషిద్ధం. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. పరీక్ష సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కోరారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు సుమారు 22.79 లక్షలమందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. రేపు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్ష కోసం విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

# మొక్కజొన్న పంటకు నిప్పు.. రైతుల కన్నీరు



చిట్యాల, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట శివారు చింతకుంట రామయ్యపల్లిలో భారీ అగ్నిప్రమాదం రైతులను విషాదంలోకి నెట్టింది. గ్రామానికి చెందిన రైతులు వీరమనేని రవీందర్, పడిదల సంపత్‌రావుకు చెందిన సుమారు ఐదు ఎకరాల మొక్కజొన్న కంకి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది.కోతకు సిద్ధంగా ఉన్న పంట ఒక్కసారిగా మంటల్లో చిక్కుకోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో గ్రామస్తులు, రైతులు కలిసి మంటలను అదుపుచేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో లక్షల రూపాయల విలువైన పంట పూర్తిగా కాలిపోయింది. గుర్తుతెలియని వ్యక్తులే నిప్పంటించి ఉండొచ్చని బాధిత రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కళ్లముందే ఆరుగాలం కష్టపడి పండించిన పంట బూడిద కావడంతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లిపోయాయని వారు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

* జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : శనివారం సంస్థ నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఏ దశల్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు పూర్తి అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో బిల్లులు వచ్చాయా అనిఅడిగి తెలుసుకున్నారు.లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పుట్టపాక గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామాన్ని శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చేనేత కార్మికుల ఇండ్లను పరిశీలించి, వారు తయారు చేస్తున్న వస్త్రాలను మరియు వారి నైపుణ్యాన్ని చూసి అభినందించారు. చేనేత రంగంలో వారి కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. తదుపరి పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్ గారు మరియు జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత గజం నర్మదా గారిని కలుసుకుని, చేనేత రంగంలోని ప్రత్యేకతలు, సంప్రదాయ నైపుణ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. వారి అనుభవాలు మరియు సూచనలు వినడం ద్వారా చేనేత అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై అవగాహన పొందారు.అలాగే పుట్టపాక క్లస్టర్ భవనాన్ని పరిశీలించి, చేనేత కార్మికులతో మాట్లాడి వారికి అవసరమైన సౌకర్యాలపై సమాచారం సేకరించారు. కార్మికులు డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, సహకార సంఘాలలో సభ్యత్వాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గజం గోవర్ధన్ క్లస్టర్ భవనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం మంజూరు చేయాలని కోరగా, జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో చౌటుప్పల్ శేఖర్ రెడ్డి., తహసీల్దార్ శ్రీనివాస్, ఏ డి చేనేత అధికారి శ్రీనివాస్,ఎంపీడీవో నారాయణపురం, గ్రామ సర్పంచ్ గజం అనిత సత్యనారాయణ పాల్గొన్నారు.

# హోంగార్డ్ సురేష్ భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం వన్టౌన్ పోలీస్ స్టేషన్లో డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ ఆఫీసర్ సురేష్ కు శనివారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స అందిస్తుండగానే సురేష్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృత హాస్పిటల్ లో ఉన్న హోంగార్డ్ ఆఫీసర్ సురేష్ భౌతిక కాయానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నివాళులర్పించారు.ఎల్లప్పుడు చురుకుగా విధులు నిర్వర్తించే సురేష్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడం పట్ల ఎస్పీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించి,తదుపరి కార్యక్రమాలను దగ్గరుండి చూసుకోవాలని అధికారులకు సూచించారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం లింగాల ఘనపురం మండలం లోని చీటూరు, కుందారం గ్రామ పంచాయతీల పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.కేంద్రాల్లో టోకెన్ల జారీ, తూకం, తేమ పరీక్షలు వేగవంతంగా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్ పనులు జాప్యం లేకుండా చూడాలన్నారు. అవసరమైన హమాలీలు, వాహనాలను సమకూర్చి ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలని అధికారులకు తెలిపారు. ప్రతి రైతు వివరాలను వెంటనే ట్యాబ్ లో నమోదు చేసి, చెల్లింపులు 48 గంటలలోపు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులు వేచి ఉండ కుండా ఏర్పాట్లు చేయాలన్నారు.ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచు కుని కొనుగోలు కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలని, వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారా నికి తక్షణ చర్యలు తీసుకుంటా మని ఆయన హామీ ఇచ్చారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు,ఐ.కె.పి సిబ్బంది పాల్గొన్నారు.


# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, ప్రజాస్ఫూర్తి : రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం లింగాల ఘనపురం మండలం లోని చీటూరు, కుందారం గ్రామ పంచాయతీల పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్రాల్లో టోకెన్ల జారీ, తూకం, తేమ పరీక్షలు వేగవంతంగా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్ పనులు జాప్యం లేకుండా చూడాలన్నారు. అవసరమైన హమాలీలు, వాహనాలను సమకూర్చి ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలని అధికారులకు తెలిపారు. ప్రతి రైతు వివరాలను వెంటనే ట్యాబ్ లో నమోదు చేసి, చెల్లింపులు 48 గంటలలోపు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులు వేచి ఉండ కుండా ఏర్పాట్లు చేయాలన్నారు.ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచు కుని కొనుగోలు కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలని, వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారా నికి తక్షణ చర్యలు తీసుకుంటా మని ఆయన హామీ ఇచ్చారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు,ఐ. కె.పి సిబ్బంది పాల్గొన్నారు.


# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

* మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని "న్యాక్" (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు.అనంతరం నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సమస్యగా ఉందని, అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చదివిన చదువుకు ఉద్యోగం ఇచ్చే విధంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, అందులో భాగంగా అన్ని జిల్లాలలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ద్వారా 5000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని ఆయన కంపెనీలతో కోరారు. యువత పెద్ద ఎత్తున జాబ్ మేళాకు వస్తున్నందున ఆదివారం కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిమెంటు కంపెనీలు, రైస్ ఇండస్ట్రీస్, ఫార్మా తదితర అనేక కంపెనీలు ఉన్నాయని, అందువల్ల స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం తో పాటు, కంపెనీలపై కూడా ఉందని అన్నారు. నిరుద్యోగ యువత ఎలాంటి ఉద్యోగం వచ్చినా ముందుగా చేరాలని, అనవసరంగా సమయం వృధా చేసుకోవద్దని ,ఉద్యోగం చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోవాలని, ప్రత్యేకించి గ్రూపు ఇతర ఉద్యోగాలకు చదువుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంఎస్ ఎం ఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉందని, దీని ద్వారా కూడా స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. గతంలో తన హయాంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 18,400 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. నల్గొండ జిల్లా లోని న్యాక్ సంస్థ అతిపెద్దదని, దీని ద్వారా అనేక వృత్తులలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు .పట్టణంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం అన్ని కల్పించామని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలలో అనేక మంది చనిపోతున్నారని రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతను చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల జిల్లాలో ఫార్మా కంపెనీలో సంభవించిన ప్రమాదాల పై మాట్లాడుతూ అన్ని కంపెనీలు భద్రత చర్యలను తప్పకుండా పాటించాలని చెప్పారు .నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు .జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 124 కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇచ్చేందుకు రావడం జరిగిందని, ఇందులో ఐటి,బ్యాంకింగ్ ,కంప్యూటర్ ,బిజినెస్ సర్వీస్ వంటి రంగాలలో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. కంపెనీలు వారి వద్ద ఉన్న అన్ని ఖాళీలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం రావడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మారుతుందని, ఇది మంచి అవకాశం అని అన్నారు.డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ డైరెక్టర్ రాజేందర్రెడ్డి తదితరులు మాట్లాడారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ కలెక్టర్ వై. అశోక్ రెడ్డి డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ ,జిల్లా క్రీడలు, యువజన సర్వీసులు అభివృద్ధిలో శాఖ అధికారి అక్బర్ అలీ, పరిశ్రమల శాఖ జిఎం సతీష్, న్యాక్ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

* కలెక్టర్ బి చంద్రశేఖర్




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు, వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శనివారం నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా,మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణపై అవగాహన కల్పించేందుకు పోలీస్ మరియు ఉమెన్ & చైల్డ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అతిథులుగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు, వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. యువత క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటేనే విజయాన్ని సాధించగలరని తెలిపారు. యువత "మత్తు పదార్థాలకు నో చెప్పండి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరండి" అని సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం మరియు సమాజానికి తీవ్ర హానిని కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు స్నేహితుల ప్రభావం, ఆసక్తి లేదా ఒత్తిడి కారణంగా డ్రగ్స్ వైపు మళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలు దెబ్బతింటాయని, మానసికంగా ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అలాగే చదువుపై దృష్టి కోల్పోవడం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ ఆఫర్ చేసినప్పుడు స్పష్టంగా "కాదు" అని చెప్పాలని, చెడు స్నేహితులను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే 100 లేదా 1908 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ వినియోగం చట్టపరంగా నేరమని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం డ్రగ్స్ వినియోగం పై వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి ,నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి , టూ టౌన్ సిఐ రాఘవరావు , వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి , ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య , ఉమెన్ & చైల్డ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# 30 వేల ఎకరాలకు భూ హక్కులు

* అర్హులందరికీ పట్టాలు ఇస్తాం: ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూ హక్కులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న 30 వేల ఎకరాల భూములకు సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు అందజేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సాదా బైనామా భూములకు కూడా పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మారై, సీటీ స్కాన్, వెంటిలేటర్ల ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 2,700 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. కొడవటంచ ఆలయాన్ని యాదగిరిగుట్ట తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లును ఆకస్మిక తనిఖీ చేసిన ప్రముఖులు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని మల్లికార్జున రైస్ మిల్లును భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లుకు ధాన్యం లోడ్‌తో వచ్చిన లారీలను పరిశీలించి, వాటి అన్లోడింగ్ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యం కు గల కారణాలు మిల్లు ఓనర్ ను అడిగి తెలుసుకున్నారు.మిల్లుకు చేరుకున్న లారీలను వెంటనే అన్లోడ్ చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మిల్లు యజమానితో ఫోన్ ద్వారా మాట్లాడిన ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ కారణాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లు యజమాని, హమాలీలు తక్కువగా ఉండటంతోనే అన్లోడ్ పనుల్లో ఆలస్యం జరుగుతోందని వివరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని మిల్లుల బాధ్యత అని స్పష్టం చేశారు. వెంటనే అవసరమైనంత మంది హమాలీలను నియమించి, మిల్లుల కు వచ్చే ప్రతి లారీని అదే రోజు అన్లోడ్ చేసి పంపించాలని ఆదేశించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు , నిల్వ ప్రక్రియను వేగవంతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మైసమ్మనగర్ లో బోర్వెల్ పనులు ప్రారంభం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: వేసవిలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ అన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ నిధుల నుంచి మంజూరైన బోర్వెల్ పనులను శనివారం ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసమ్మ నగర్ బి బ్లాక్ లో గత రెండు నెలల క్రితం కాలనీ అధ్యక్షులు బసవప్ప , ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి , కోశాధికారి శ్రీకాంత్ యాదవ్ వారి కమిటీ సభ్యులతో కలిసి ప్రజలకు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారు కావున రెండు బోరుబావులు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించి మల్కాజ్గిరి ఎంపీ ని కలిసి రెండు బోరు బావులు ఏర్పాటు చేయాలని వారిని కోరగా దీంతో వెంటనే స్పందించి 8 లక్షల రూపాయలు రెండు బోర్లు మంజూరు చేశారు అందులో భాగంగా శనివారం జే.కె.శేఖర్ యాదవ్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తనలక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పున్నా రెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి సురేష్ రెడ్డి , బస్తీవాసులు అధ్యక్షులు బ్రహ్మం, హనుమంతు , ప్రమోద్ , సునీల్, ప్రవీణ్, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## డీఎస్పీగా పదోన్నతి పొందిన
# సిఐ గట్ల మహేందర్ రెడ్డి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణ సీఐ గట్ల మహేందర్ రెడ్డికి డీఎస్పీగా పదోన్నతి లభించిన సందర్భంగా శనివారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తన విధి నిర్వహణలో అందించిన మార్గదర్శకానికి ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎస్పీ డా. శబరిష్ మాట్లాడుతూ సీఐ మహేందర్ రెడ్డి ని అభినందిస్తూ, కొత్త బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.పోలీస్ శాఖలో క్రమశిక్షణ, సేవాభావం,ప్రజల పట్ల బాధ్యతతో పనిచేస్తూ ఉన్నత స్థానాలను అధిరోహించడం ప్రతి పోలీస్ అధికారి లక్ష్యంగా ఉండాలని ఈ సందర్భంగా ఎస్పీ కొనియాడారు.

## సీజీజీ పోర్టల్ ద్వారా
# వినతుల ఆన్‌లైన్ నమోదు

**: సూపరింటెండెంట్ రజిత**

జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు, ఇకపై ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వ హించనున్నట్లు కలెక్టరేట్ హెచ్ సూపరింటెండెంట్ రజిత శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆయా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డీఓ) కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. సంబంధిత ఆర్‌డీఓ నోడల్ అధికారిగా వ్యవహరించ గా, అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని తప్పనిసరిగా ఆన్‌లైన్ లో నమోదు చేయాలని, ఇకపై ఎన్ఐసీ (ఎన్ఐసీ) పోర్టల్ స్థానంలో సీజీజీ (సీజీజీ) ప్రజావాణి పోర్టల్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ప్రతి వినతిదారునికి యూనిక్ రిఫరెన్స్ నంబర్‌తో కూడిన రసీదు ఇవ్వబడుతుందని, దీని ద్వారా వారు తమ వినతి స్థితిని సులభంగా తెలుసుకోవచ్చ న్నారు. ఈ పోర్టల్ ద్వారా వినతుల నమోదు, శాఖల వారీ కేటాయింపు, చర్యల నివేదికలు (ఎటీఆర్ ), మధ్యంతర నివేదికలు, ఫిర్యాదుల స్థితి పర్యవేక్షణ సులభతరం అవుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు వినతులను 30 రోజుల్లోపు పరిష్కరించి, సంబంధిత నివేదికలను పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఆలస్యం జరిగితే కేసులు స్వయంచాలకంగా ఉన్న తాధికారులకు పంపబడతాయని హెచ్చరించారు. ప్రజలు తమ వినతులను నమోదు చేసు కోవడానికి, వాటి స్థితిని తెలుసుకోవడానికి సీజీజీ ప్రజావాణి పోర్టల్‌ను వినియో గించుకోవాలని కోరారు.

## విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్ళి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

*** టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్ళి ఉన్నత స్థాయికి చేరుకోవాలని టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి అన్నారు. 2025 2026 విద్యా సంవత్సరం ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల్లో 570 నుండి 585 మార్కులు సాధించిన 13 మంది విద్యార్థిని విద్యార్థులకు టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ టీటీడీ నుండి శాలువా తెప్పించి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 తరగతి పరీక్షలలో అధిక మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు ఎంతో ఆనందాన్ని అందించారు అని అన్నారు. ఇంటర్ డిగ్రీ ,బీటెక్ ఆ పై చదువులు మీరు ఇదే తరహాలో కష్టపడి చదివితే మీ భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. మంచి ఉద్యోగాలలో స్థిరపడతారని తెలిపారు మీరు సాధించిన ఫలితాలు మునుముందు పోటీ ప్రపంచంలో గొప్ప విద్యావంతులు గా ఎదుగుతారో అంత మంచి బంగారు భవిష్యత్తును, కీర్తి ప్రతిష్టలు లభించేలా చూడమని భగవంతుని కోరుతూ.. ఆశీర్వదించారు.అనంతరం టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ టి. అరుణ కుమారి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, సూర రవిచంద్ర రెడ్డి లు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో కొత్త మాడ్యూళ్లు



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మాడ్యూళ్లను తీసుకొచ్చింది. లబ్ధిదారులకు భవిష్యత్తులో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండడానికి ఈ నిర్ణయం తీసుకుంది. అర్హుల గుర్తింపు కూడా సులభం కానుంది. వీటితోపాటు క్షేత్రస్థాయి ఫిర్యాదుల పరిష్కారం కూడా కలెక్టర్లకే అప్పగించింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎల్ 1 లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోంది. సొంత స్థలం ఉండి, ఇళ్లులేని దరఖాస్తుదారులను ఎల్ 1 జాబితాలో చేరారు. ఇందులో మొత్తం 23.30 లక్షల మంది ఉన్నారు. ఇళ్లతోపాటు సొంతస్థలం లేని దరఖాస్తుదారులను ఎల్ 2లో చేర్చారు. ఇందులో 21.49 లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు. అనర్హుల దరఖాస్తుదారులను ఎల్ 3లో చేర్చారు. ఇందులో 32.98 లక్షల మంది ఉన్నారు. కొత్త మాడ్యూళ్ల ద్వారా ఈ జాబితా లబ్ధిదారుల ఎంపిక, మార్పులు, చేర్పులు, అనుమతులు త్వరగా జరగనున్నాయి. గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్దకు గెజిటెడ్ స్థాయి అధికారి వెళ్లి విచారణ జరిపి అర్హుడా? కాదా? అని మాన్యువల్‌గా నివేదిక ఇచ్చేవారు. ఇకనుంచి ఈ విధానానికి ముగింపు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో 'అర్హులైన లబ్ధిదారులు', 'మొత్తం విచారణ జరిపిన లబ్ధిదారులు' అనే కొత్త మాడ్యూళ్లను తీసుకొచ్చారు. గెజిటెడ్ స్థాయి అధికారి ఈ యాప్ ద్వారానే పరిశీలించి ఎల్ 1 జాబితాకు అర్హత ఉందా? లేదా? అనేది నమోదు చేస్తారు. ఇవి ఎంపీడీవో/ పురపాలిక కమిషనర్ల లాగిన్‌కు వెళ్లిపోతాయి.

# ప్రజలకు ఇవ్వని వాగ్దానాలను చెప్పని పథకాలను కూడా అమలు చేస్తున్నాం

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ప్రజలకు చెప్పని అనేక కొత్త కొత్త పథకాలను అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భావనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన నల్గొండ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు గ్రామ ,మండల స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందనిరాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు మహిళలకు ఉచిత సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500రూపాయలకు ఎల్పిజి గ్యాస్, వంటి ఆరు గ్యారెంటీలను ఇచ్చి అమలు చేస్తున్నదని, అంతేకాక ఇవ్వని వాగ్దానాలు, దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వపరంగా మధ్యాహ్న భోజనం అందించనుందని తెలిపారు. ఉదయం రాజి జావ, మధ్యాహ్నం భోజనం ,సాయంత్రం సమయంలో అల్పాహారం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. ఇది తెలంగాణలో విప్లవాత్మకమైన పథకం అని అన్నారు. ఈ పథకం కింద సంవత్సరంలో 1400 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు .వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉచిత విద్యుత్తు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేయడం జరిగిందని, తిరిగి తమ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత బస్సు పథకం కింద రెండు కోట్ల 86 లక్షలు మంది మహిళలు బస్సులలో తిరగడం జరిగిందని, ఉచిత విద్యుత్ కింద 5000 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు . నల్గొండ పట్టణంలో రామగిరి టెంపుల్ నుండి దేవరకొండ రోడ్డు వరకు 15 కోట్ల రూపాయలతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నామని, జాబ్ మేళా ద్వారా 5000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాల అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. న్యాక్ కేంద్రం ద్వారా టైలరింగ్, మెకానిక్ ఇతర ట్రేడులలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని, ఇంకా మరిన్ని కోర్సు ప్రవేశపెడతామని తెలిపారు. మహిళలకు ఆసక్తి ఉన్నవారందరికీ ప్రత్యేకించి మిషన్ నేర్చుకున్న వారందరికీ కుట్టు మిషన్లు ఇస్తామని చెప్పారు.1నల్గొండ నియోజకవర్గంలో 740 మంది ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంకా ఇండ్లు మొదలు పెట్టలేదని, ఈ నెలాఖరు నాటికి చేపట్టిన ఇంద్రమైండ్లన్నీ పూర్తి కావాలని ,ఎవరైనా ఇండ్లు నిర్మించుకునేందుకు ఇష్టం లేనట్లయితే తక్షణమే రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని, అలాంటి జాబితాను సోమవారం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అలాంటి వారి స్థానంలో కొత్త లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరుగుతుందని, జూన్ నుండి మరో విడత ఇందిరమ్మ ఇండ్లు పొందేందుకు అనుమతి వస్తుందని, అందువల్ల మే చివరినాటికి నిర్మాణం చేపట్టిన ఇండ్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇండ్లను నిర్మించడం జరుగుతున్నదని తెలిపారు. ధాన్యం కొనుగోలులో భాగంగా రైతుల చెల్లింపులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రతి గ్రామం లో ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో దగ్గరగా ఉండేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టే కార్యక్రమాలను చదివి వినిపించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర పవార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను
# విస్తృతంగా ప్రచారం చేయాలి

*** ఎమ్మెల్యే కుంభం**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భువనగిరి పట్టణం రాయగిరిలోని సోమా రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.,ప్రతి శాఖలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు సమగ్రంగా వివరించగా, క్షేత్ర స్థాయిలో అమలు అవుతున్న పథకాలపై ఎక్కడైనా లోపాలు ఉన్నా వాటిని వెంటనే గుర్తించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి ప్రాధాన్యతగా తీసుకుని, ప్రతి కుటుంబానికి నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తూ, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా మహిళలకు బస్ లో ప్రయాణం చేస్తున్నారని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీకి చేయడం జరుగుతుందన్నారు.అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం జరిగింది అని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడం ద్వారా రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక రాయితీలు అందిస్తూ రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో కొనసాగుతోందని, భువనగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరిన్ని ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ రాష్ట్రంలో ఇల్లు లేని ఒక్క కుటుంబం కూడా ఉండకూడదనేది ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జూన్ 2వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉందని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడం జరుగుతుంది అన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాలను, అమలు కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటుగా ప్రజల అవసరాలను స్థానికంగా తెలుసుకుని త్వరితంగా పరిష్కరించడం ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల,భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా బాబు రావు,మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో
# రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో శనివారం స్థానిక లక్ష్మీ గార్డెన్ లో నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వము వచ్చి రెండు సంవత్సరాల ఐదు నెలల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలుగా పనిచేస్తున్నానని,హుస్నాబాద్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రానికి తలమానికం కావాలనే ఉద్దేశంతోటి ఇక్కడ అభివృద్ధిని ప్రధానంగా విద్యా, వైద్యం, నేటిపారుదల రంగాలపై దృష్టి సారించి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలు తలెత్తుకొని గర్వంగా ఉండాలనే ఉద్దేశంతోటి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నానని మంత్రి తెలిపారు.హుస్నాబాద్ ప్రాంతాన్ని పర్యాటక రకంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ చెరువును అర్బన్ పార్కు పట్టణ సుందరీకరణతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నామని విద్యాభివృద్ధిలో కూడా ఏటీసీ సెంటర్ నిర్మాణం న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో పూర్తిగా బాధ్యత తీసుకొని ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా అన్నారు.అనంతరం స్వయం సహాయక సంఘాలకు 128 కోట్ల రూపాయల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను నేతన్న భీమా చెక్కులను పంపిణీ చేశారు. 109 చైల్డ్ హెల్ప్ లైన్ సెంటర్ మిషన్ వాత్సల్య పోస్టర్ను రిలీజ్ చేశారు. అంతకుముందు వివిధ శాఖల ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పర్లేషన్నించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి సిపి రష్మీ పెరుమాళ్ ఆర్డీవో రామ్మూర్తి,హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి మార్కెట్ కమిటీ చైర్మన్ లు మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ గ్రామాల సర్పంచ్లు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్.. జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు క్లోజ్!



వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌యూజీ పరీక్ష (NEET UG 2026)కు సర్వం సిద్ధమైంది. దేశ వ్యాప్తంగా ఆదివారం (మే 3న) జరగనున్న ఈ పరీక్షకు ఎన్‌టీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పరీక్షా కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ (గతంలో 144 సెక్షన్) అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఓ పబ్లిక్ నోటీసును విడుదల చేశారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమిగూడటం నిషిద్ధమని నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే, పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసి ఉంటాయని తెలిపారు. ఈ పరీక్ష సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్ విజ్ఞప్తి చేశారు.

## వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర పెంపు ఉపసంహరించుకోవాలి


మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే వాణిజ గ్యాస్ సిలిండర్ ధరలు 994 పెంచడం సరికాదని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలతో అవసరం ఉన్నప్పుడు ధరలను పెరగనివ్వకుండా చూస్తున్న మోడీ ప్రభుత్వం ఓట్లు బ్యాలెట్ బాక్స్ లో పడగానే ధరల భారం ప్రజలపై మోపి సామాన్య మధ్యతరగతి ప్రజానీకం జేబులో లూటీ చేయటం సరికాదన్నారు. ఆహార ఉత్పత్తులపై ఇతర రంగాలపై పరోక్షంగా భారం పడనుంది.ఆయిల్ కంపెనీలకు ధరలు పెంచుకోవడానికి స్వేచ్ఛనిచ్చే కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పుడు ధరలను తగ్గించమని ఎందుకు ఆదేశించలేదని ఆ ప్రకటనలో ప్రశ్నించారు. వాణిజ్య సిలిండర్ ధర పెరగటం వల్ల పరోక్షంగా ప్రజానికంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. అమెరికా, ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడటంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఎలాగైనా గెలవాలని అబద్ధపు ప్రచారాలతో అధికార దుర్వినియోగం చేసిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ కష్టాలను తొలగించటంలో నిర్లక్ష్యం ఉంది. రేపు మాపో గృహ వినియోగ గ్యాస్, పెట్రోల్ డీజిల్ రేట్లను పెంచే ప్రమాదం ఉందని అన్నారు . ఆయిల్ కంపెనీలు ఆ నష్టాన్ని భరిస్తూ ధరలు పెంచకుండా ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను పెంచితే ప్రజల వీధుల్లోకొచ్చి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేయక తప్పదని రవి ఆ ప్రకటనలో హెచ్చరించారు. గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని రవి కోరారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర పెంపు ఉపసంహరించుకోవాలి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే వాణిజ గ్యాస్ సిలిండర్ ధరలు 994 పెంచడం సరికాదని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలతో అవసరం ఉన్నప్పుడు ధరలను పెరగనివ్వకుండా చూస్తున్న మోడీ ప్రభుత్వం ఓట్లు బ్యాలెట్ బాక్స్ లో పడగానే ధరల భారం ప్రజలపై మోపి సామాన్య మధ్యతరగతి ప్రజానీకం జేబులో లూటీ చేయటం సరికాదన్నారు. ఆహార ఉత్పత్తులపై ఇతర రంగాలపై పరోక్షంగా భారం పడనుంది.ఆయిల్ కంపెనీలకు ధరలు పెంచుకోవడానికి స్వేచ్ఛనిచ్చే కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పుడు ధరలను తగ్గించమని ఎందుకు ఆదేశించలేదని ఆ ప్రకటనలో ప్రశ్నించారు. వాణిజ్య సిలిండర్ ధర పెరగటం వల్ల పరోక్షంగా ప్రజానికంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. అమెరికా, ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడటంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఎలాగైనా గెలవాలని అబద్ధపు ప్రచారాలతో అధికార దుర్వినియోగం చేసిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ కష్టాలను తొలగించటంలో నిర్లక్ష్యం ఉంది. రేపు మాపో గృహ వినియోగ గ్యాస్, పెట్రోల్ డీజిల్ రేట్లను పెంచే ప్రమాదం ఉందని అన్నారు . ఆయిల్ కంపెనీలు ఆ నష్టాన్ని భరిస్తూ ధరలు పెంచకుండా ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను పెంచితే ప్రజల వీధుల్లోకొచ్చి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేయక తప్పదని రవి ఆ ప్రకటనలో హెచ్చరించారు. గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని రవి కోరారు.

## మే 4, నుండి ప్రతి సోమవారం డివిజనల్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ

*** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్,**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై జిల్లా స్థాయితో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయి (ఆర్డీఓ కార్యాలయాలలో) కూడా నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోనీ మహబూబాబాద్ డివిజన్ (మహబూబాబాద్ పట్టణం) తొర్రూరు డివిజన్ (తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో) ఇకపైన ప్రతి సోమవారం ఉదయం 10.30 నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టుగా, ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అన్ని డివిజనల్ స్థాయి విభాగాల డివిజనల్ అధికారులు పాల్గొంటరని తెలిపారు.కావున సంబంధిత డివిజన్, మండలల ప్రజలు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం దరఖాస్తులను వారి సమీపంలో గల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్ డి ఓ) కార్యాలయములలో కూడా సమర్పించ వచ్చునని మరియు తగు రసీదు ను పొందవచ్చునని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

**: ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: నీట్-2026 ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 163 సెక్షన్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని మొత్తం 3 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. సింగరేణి ఉమెన్స్ కళాశాల (కొత్తగూడెం), రామచంద్ర డిగ్రీ కళాశాల (లక్ష్మీదేవిపల్లి), సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల (పాల్వంచ)లలోని పరీక్షా కేంద్రాల్లో జరగబోయే ఈ పరీక్షకు జిల్లా నుండి 1048 అభ్యర్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

# పార్ట్ టైం లెక్చరర్ లను అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పదోన్నతి కల్పించాలి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: రాజ్య సభ సభ్యులుగా నూతనంగా ఎన్నిక కాబడిన సందర్భంగా వేం నరేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం పార్నాంధి రామయ్య రిటైర్డ్ టీచర్ వేం నరేందర్ రెడ్డి ను సన్మానించారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి, డాక్టర్ ఎస్వీ రత్నం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ,డాక్టర్ మిట్ట గడుసుల మనోహర్ రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలలో పార్ట్ టైం లెక్చరర్ లను అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్ )మార్పు చేయాలని కోరారు . జూన్ నెల 2014 ముందు పార్ట్ టైం లెక్చరర్ లను అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉండేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్రక్రియ ప్రభుత్వం నిలిపివేసింది. పార్ట్ టైం లెక్చరర్లు లకు అన్ని అర్హతలు ఉన్నాయి. వారి సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి. పార్ట్ టైం లెక్చరర్ లను పూర్తిగా వినియోగిస్తూ 12 నెలల పాటు కన్సాలిడేటెడ్ జీతం ఇవ్వాలని కోరారు.

# మహబూబాబాద్ జిల్లాలో మే 3న నీట్ యు జీ 2026 పరీక్ష

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 మే 3వ తేదీ (ఆదివారం) నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్,సిటీ కోఆర్డినేటర్ స్నేహ శబరిష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న TGSWRS/JC బాలికల పాఠశాలను ఏకైక పరీక్షా కేంద్రంగా కేటాయించారు.ఈ కేంద్రంలో మొత్తం 476 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులను ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారని మధ్యాహ్నం 01:30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడరన్నారు.అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు దానిపై పోస్ట్‌కార్డ్ సైజు ఫోటోను అతికించి తీసుకురావాలని అలాగే ప్రభుత్వం గుర్తించిన ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని అన్నారు.మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, వాచీలు, క్యాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పర్సులు, బెల్టులు, ఆభరణాలు మరియు ఎటువంటి స్టేషనరీ (పెన్నులు, పెన్సిళ్లు, పేపర్లు) అనుమతించబడవని, అభ్యర్థులు కేవలం పారదర్శకమైన వాటర్ బాటిల్‌ను మాత్రమే వెంట తెచ్చుకోవచ్చన్నారు.పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల బ్యాగులు లేదా ఇతర వస్తువులను భద్రపరచడానికి ఎటువంటి సదుపాయం ఉండదు. కావున నిషేధిత వస్తువులను వెంట తీసుకురావద్దని సూచించారు.అభ్యర్థులు నిర్ణీత డ్రెస్ కోడ్‌ను ఖచ్చితంగా పాటించాలని, డాక్యుమెంట్ వెరిఫికేషన్ మరియు ఫ్రిస్కింగ్ ప్రక్రియ దృష్ట్యా అభ్యర్థులు గడువు సమయం కంటే ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని అన్నారు.పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, విద్యార్థులకు తాగునీరు,పారిశుధ్యం మరియు సీటింగ్ సౌకర్యాలను కల్పించామని అధికారులు తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం nta.nic.in వెబ్‌సైట్‌ను చూడవచ్చునని పరీక్ష రాస్తున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన పోస్టర్ విడుదల



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో శనివారం రోజున విద్యుత్ వారోత్సవాలలో భాగంగా విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కరెంటు షాక్ తగలకుండా రైతులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను సర్పంచ్ సుతారి సుమలత విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు పొలాల వద్ద, ఇళ్ల వద్ద విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, తెగిపడిన వైర్లను తాకవద్దని, వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.గ్రామ ప్రజలు లో ఓల్టేజి సమస్య ఉంది అని సర్పంచ్ కు తెలుపగ అధికారులతో మాట్లాడి రెండు వీధులలో 15 కె వి ట్రాన్స్‌ఫర్ లు రెండు బిగించారు.ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ గంగన్న, జూనియర్ లైన్మెన్ తిరుపతి,వార్డు మెంబర్ అరె శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, కుమార్, మెడ విజయ్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

**– మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**– జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పొంగులేటి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పథకం కింద దుమ్ముగూడెంలో నిర్మించనున్న రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతోపాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. శనివారం భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి, ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలో ప్రతిభ కనపరిచిన ఈదులపూసపల్లి విద్యార్థులు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మహబూబాబాద్ మండలంలోని, ఈదులపూసపల్లి పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి వీరయ్య ఆధ్వర్యంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అఫ్రా తబస్సుమ్ 576 మార్కులు, జానకి నందిని 571, సపావత్ ప్రవళిక 546, కన్నెబోయిన సంజన 538 లను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 576 మార్కులు సాధించి,రెండో స్థానంలో నిలిచిన విద్యార్థిని షేక్ అఫ్రా తబసుం కు ఐదువేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఒకటో వార్డ్ కౌన్సిలర్ ధూపటి స్పందన వినయ్ గౌడ్, బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కోట ఎల్లేష్, ఉపసర్పంచ్ బండారు మహేష్ అతిథులుగా పాల్గొన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి వీరయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈదులపూసపల్లి విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో గత నాలుగు సంవత్సరాలుగా మహబూబాబాద్ జిల్లాలో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఎక్కువ మార్కులు సాధిస్తున్నారన్నారు.ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 10 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అంకితభావంతో పనిచేసే అత్యున్నత ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లాంటి సౌకర్యాలు అందిస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించబోతుందని కావున ప్రజలు వారి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు.పదవ తరగతి పరీక్షల్లో ఈ స్థాయిలో మంచి ఫలితాలు సాధించిన ఈదులపూస పల్లి పాఠశాల విద్యార్థులను, అందుకు అహర్నిశలు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ భద్రు, ఈదులపూసపల్లి పాఠశాల ఉపాధ్యాయులు గొర్రె శ్రీనివాస్, ఓం ప్రకాష్, కోటయ్య, స్వప్న ,నాగరాజు, బ్రాహ్మణపల్లి పాఠశాల ఉపాధ్యాయులు రాచకొండ ఉపేందర్, కుప్పం సూర్యతేజ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

*** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా**



అందోలు, ప్రజాస్ఫూర్తి :ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ అన్నారు. శనివారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలందించేందుకు ట్రామా, ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

**మహిళా సాధికారతకు కృషి...**

మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా గతంలో పావలా వడ్డీ పథకం, అనంతరం వడ్డీ లేని రుణాల పథకాలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి వనరులను మహిళలకు కేటాయిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పడుతున్నదన్నారు.

*** విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ...**

విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం, మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రూ.200 కోట్ల వ్యయంతో సింగూర్ లైన్ పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా విద్య, వైద్య రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్నదని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్ శాఖ ద్వారా రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, మున్సిపాల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు తో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని కమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు రూ. 6.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండగా నిలుస్తోందని, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద 86 మందికి రూ. 86.09 లక్షల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాలతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆకాంక్షిస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 49 సంఘాలకు రూ. 5.25 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసా అని, నియోజకవర్గంలోని 72 మంది బాధితులకు రూ. 35 లక్షల విలువైన వైద్య సహాయం మంజూరైందని వివరించారు. ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివద్ధి అని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా పథకాలు అందేలా కషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిధులను మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడి కష్టంలో పాలుపంచుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు కమిషనర్ సుజాత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మండల అధికారులు పుల్లయ్య, సుభాషిణి, నాగరాజు, కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# చిన్నారి రక్షితకు అండగా బోడిగం శ్రీనివాస్ గౌడ్ సహాయం



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : వినాయక నగర్‌లో జరిగిన దుర్ఘటనలో ఆరు సంవత్సరాల బాలిక రక్షిత ఫస్ట్ ఫ్లోర్ బాల్కనీ నుంచి జారి కింద పడిపోయింది. ప్రస్తుతం ఆమె తిరుమలగిరిలోని నీరో హాస్పిటల్ ఐసీయూలో చికిత్స పొందుతోంది. బాలిక ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని స్థానికులు, స్నేహితులు కోరుకుంటున్నారు. ఈ ఘటన నేపథ్యంలో, బాధిత కుటుంబానికి అండగా నిలవాలని భావించిన హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ బోడిగం శ్రీనివాస్ గౌడ్ తన వంతు సహాయంగా రూ.10,000/ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారి త్వరగా కోలుకోవాలని, అవసరమైతే మరింత సహాయం అందించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే సమాజంలోని ఇతరులు కూడా ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు.గ్రామ ప్రజలు లో ఓల్టేజి సమస్య ఉంది అని సర్పంచ్ కు తెలుపగ అధికారులతో మాట్లాడి రెండు వీధులలో 15 కె వి ట్రాన్స్‌ఫర్ లు రెండు బిగించారు.ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ గంగన్న, జూనియర్ లైన్మెన్ తిరుపతి,వార్డు మెంబర్ అరె శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, కుమార్, మెడ విజయ్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ ఎల్పీ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వెంకట్రామిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ను, మాజీ కార్పొరేటర్ బీ. విజయ్ శేఖర్ గౌడ్ లను వారి నివాస కార్యాలయాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులంతా ఐకమత్యంగా ఉండి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన సంక్షేమ సంఘం సభ్యులకు కాలనీ అభివృద్ధిలో వారి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కార్తీక్ గౌడ్, బాలు నేత, వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎన్.లక్ష్మణ్ గౌడ్, నూతన కార్యవర్గ సభ్యులు సతీష్ గట్టోజి, మహమ్మద్ రషీద్, , మోహన్ రెడ్డి, షాబుద్దీన్, రాజిరెడ్డి, రామకృష్ణ, అన్సార్, మహాదేవ్, యాదగిరి, వెంకట్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మేషక్ బాబు, మెహబూబ్ బి తదితరులు పాల్గొన్నారు.



# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**







హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూలఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన






కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.



**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్‌కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

## ఏప్రిల్‌లో ఏపీ ఖజానాకు పన్నుల పంట..

**రూ. 5,543 కోట్ల రికార్డ్ వసూళ్లు**

**ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో రూ.5,543 కోట్ల పన్నుల వసూళ్లు**

**జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే అత్యధిక నెలవారీ ఆదాయం**

**గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 12.08 శాతం వృద్ధి నమోదు**




**అమరావతి:** అంధ్రప్రదేశ్‌లో పన్నుల వసూళ్లు సరికొత్త రికార్డు సృష్టించాయి. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర ఖజానాకు ఏకంగా రూ. 5,542.7 కోట్ల ఆదాయం సమకూరింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఒకే నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే తొలిసారి. గతేడాది ఏప్రిల్‌లో వసూలైన రూ. 4,946 కోట్లతో పోలిస్తే ఇది 12.08 శాతం అధికం కావడం గమనార్హం.

ఈ గణనీయమైన వృద్ధికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడమే కీలక కారణమని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డేటా విశ్లేషణ, యూపీఐ లావాదేవీల పర్యవేక్షణ, డిస్కమ్‌ల డేటాతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ల ధ్రువీకరణ వంటి సంస్కరణలు సత్ఫలితాలు ఇచ్చినట్లు ఆయన వివరించారు. పన్నుల లీకేజీని అరికట్టి, పన్ను పరిధిని విస్తరించడంలో ఈ విధానాలు ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు.

విభాగాల వారీగా చూస్తే... నికర జీఎస్టీ వసూళ్లు 6.83 శాతం వృద్ధితో రూ. 3,796.91 కోట్లకు చేరాయి. పెట్రోలియంపై వ్యాట్ వసూళ్లలో ఏకంగా 26.72 శాతం వృద్ధి నమోదై, రూ. 1,613.36 కోట్లుగా ఉంది. ఇక వృత్తి పన్ను ద్వారా రూ. 42.9 కోట్లు సమకూరాయి. మొత్తం మీద గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈసారి రూ. 598 కోట్ల అదనపు ఆదాయం ప్రభుత్వానికి లభించింది.

## ఇంధన ధరల ఎఫెక్ట్..
## విమాన సర్వీసులు నిలిపేసిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్




**న్యూఢిల్లీ:** ఇంధన కొరత, పెరుగుతున్న జెట్ ఇంధన ధరల కారణంగా పలు విమానయాన సంస్థలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. కొన్ని విమానయాన సంస్థలు తమ సర్వీసులను తగ్గించుకుంటుండగా.. మరికొన్ని టికెట్ల రేట్లు పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా కు చెందిన విమానయాన సంస్థ స్పిరిట్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సర్వీసులను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలుచేయనున్నట్లు వెల్లడించింది. అన్ని విమాన సర్వీసులను రద్దు చేశామని.. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు డబ్బు తిరిగి చెల్లిస్తామని తెలిపింది. అయితే ఇతర విమానయాన సంస్థల్లో ప్రయాణ బుకింగ్‌లకు ఎలాంటి సాయం చేయబోమని స్పష్టం చేసింది.

34 ఏళ్లుగా స్పిరిట్ ఎయిర్ లైన్స్ తక్కువ ఛార్జీలతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందిస్తోంది. రోజూ వందలాది సర్వీసులను నడుపుతూ సుమారు 17,000 మందికి ఉపాధి కల్పించింది. కొవిడ్ తర్వాత పెరిగిన నిర్వహణ ఖర్చుల వల్ల ఈ ఎయిర్‌లైన్స్ పలు ఆర్థిక సమస్యలు, అప్పులతో ఇబ్బందులు పడుతోంది. ఇరాన్ యుద్ధం వల్ల జెట్ ఇంధన ధరలు ఆకాశాన్నంటడంతో.. ప్రస్తుతం ఈ విమానయాన సంస్థ దివాలా తీసే పరిస్థితికి వచ్చింది. ఆగస్టు 2025 నాటికి స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌కు 8.1 బిలియన్ డాలర్ల అప్పులు, 8.6 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి నుంచి రక్షణ కల్పించాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఎటువంటి ఆర్థికసాయం అందకపోవడంతో సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించుకుంది. తమ ఎయిర్‌లైన్స్ మూసివేత వల్ల సుమారు 17వేల మంది ఉద్యోగులపై ఈ ప్రభావం పడుతుందని స్పిరిట్ న్యాయవాది మార్షల్ హ్యూబ్నర్ పేర్కొన్నారు.

## ఐపీ హక్కుల పరిరక్షణకు
## ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో భారత్




**వాషింగ్టన్:** మేధో సంపత్తి (ఐపీ) హక్కుల పరిరక్షణ, అమలు విషయంలో తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న దేశాల్లో భారత్ ఒకటని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) ప్రకటించింది. 6 దేశాలతో 'ప్రాధాన్య పర్యవేక్షణ జాబితా'ను యూఎస్‌టీఆర్ విడుదల చేసిన ప్రత్యేక నివేదికలో వెల్లడించింది. ఇందులో భారత్, చైనా, ఇండొనేషియా, చిలీ, రష్యా, వెనెజువెలా ఉన్నాయి. ప్రాధాన్య దేశం (పీఎఫ్‌సీ)గా వియత్నాంను పేర్కొంది. దీని ప్రకారం.. ఐపీల విషయంలో వియత్నాంపై కఠిన నిఘాను యూఎస్ పెట్టనుంది. పీఎఫ్‌సీ విభాగంలో గత 13 ఏళ్లలో ఒక దేశానికి చోటు దక్కడం ఇదే తొలిసారి. అమెరికా ఉత్పత్తులపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపేలా ఐపీ సంబంధిత చర్యలు, విధానాలు, పద్ధతులు ఉన్న దేశాల కోసం పీఎఫ్‌సీ గుర్తింపు కేటాయించినట్లు యూఎస్‌టీఆర్ తెలిపింది. ఐపీ హక్కుల పరిరక్షణ విషయంలో చర్చలు జరిపేందుకు, చర్చల్లో గణనీయ పురోగతి సాధించేందుకు వియత్నాం నుంచి సరైన స్పందన ఉండటం లేదని వెల్లడించింది. కృత్రిమ మేధ పరిరక్షణ, అమలు విషయంలో అమెరికాలోని వ్యక్తులకు సమస్యలు ఎదురవుతున్న దేశాలను ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో యూఎస్‌టీఆర్ చేరుస్తుంది. అనైతిక వాణిజ్య విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించడమే తమకు అత్యంత ప్రాధాన్యమని యూఎస్‌టీఆర్ తెలిపింది.

# ఆడుతూపాడుతూ
# గెలిచిన చెన్నై...

**ముంబై ఈసారి కూడా కుదేల్!**

**ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో గెలుపు**

**కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కార్తీక్ శర్మ అజేయ అర్ధశతకాలు**

**98 పరుగుల కీలక భాగస్వామ్యంతో చెన్నైకి సునాయాస విజయం**

**మొదట బ్యాటింగ్ చేసిన ముంబై 7 వికెట్లకు 159 పరుగులు**

**చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్ కు మూడు వికెట్లు**

**చెన్నై:** ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టింది. చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్), కార్తీక్ శర్మ (54 నాటౌట్) అజేయ అర్ధశతకాలతో చెలరేగి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు.






160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్ (11), ఉర్విల్ పటేల్ (24) త్వరగానే వెనుదిరిగారు. దీంతో 62 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ గైక్వాడ్, కార్తీక్ శర్మ ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 98 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి మరో 11 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. గైక్వాడ్ 48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో, కార్తీక్ శర్మ 40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో రాణించారు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేయగలిగింది. నమన్ ధీర్ (57) ఒక్కడే అర్ధశతకంతో రాణించగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 18) నెమ్మదిగా ఆడి నిరాశపరిచాడు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 వికెట్లతో ముంబై పతనాన్ని శాసించగా, నూర్ అహ్మద్ 2 వికెట్లతో అతనికి సహకరించాడు. ఈ విజయంతో చెన్నై పాయింట్ల పట్టికలో మరింత ముందుకు దూసుకెళ్లింది.



## వయసు ఓ అంకె మాత్రమే..

**పాత భువీ తిరిగొచ్చాడు.. టీమిండియాలోకి తీసుకోవాలి: సెహ్వాగ్**

**ఐపీఎల్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న భువనేశ్వర్ కుమార్**

**భువీని భారత టీ20 జట్టులోకి తిరిగి తీసుకోవాలని సూచించిన సెహ్వాగ్**

**బుమ్రా-భువీ జోడీని పునరావృతం చేయాలన్న మాజీ డాషింగ్ ఓపెనర్**

**ఈ సీజన్‌లో 9 మ్యాచ్‌ల్లోనే 17 వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్**



**బెంగళూరు:** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 36 ఏళ్ల వయసులోనూ తన పాత పదును చూపిస్తూ వికెట్ల వేట సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్‌ను మళ్లీ భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ సెలక్టర్లకు సూచించాడు. వయసును కాకుండా ప్రదర్శనను ప్రామాణికంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డాడు.

క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ సెహ్వాగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కొన్నిసార్లు వయసు కేవలం ఒక అంకె మాత్రమే అనిపిస్తుంది. అతనికి 35-36 ఏళ్లు ఉంటే ఏంటి? అద్భుత ప్రదర్శనలు ఇస్తున్నప్పుడు, టీ20 ఫార్మాట్‌లో తన పునరాగమనం గురించి అతను ఆలోచించాలి లేదా సెలక్టర్లు ఆలోచించాలి" అని సెహ్వాగ్ అన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్ జోడీని మళ్లీ టీమిండియాలో చూడవచ్చా అనే కోణంలో ఆలోచించాలని సూచించాడు. "మనం పాత భువనేశ్వర్‌ను మళ్లీ చూస్తున్నాం. అతని బౌలింగ్‌లో ఆ వాడి, వేడి స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త బంతితో, పాత బంతితో కూడా అతను అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు" అని సెహ్వాగ్ ప్రశంసించాడు.

ఈ ఐపీఎల్ సీజన్‌లో భువనేశ్వర్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఆర్‌సీబీ తరఫున ఆడిన కేవలం 9 మ్యాచ్‌లలోనే 17 వికెట్లు పడగొట్టి, పర్పుల్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో నిలిచాడు.

## గాయంతో పాటు మరో కారణం..

**ధోనీ మ్యాచ్‌లకు రాకపోవడం వెనుక పెద్ద కథే ఉంది!**

**జట్టుకు తాను డిస్ట్రాక్షన్ కాకూడదనే ఉద్దేశంతోనే ధోనీ మ్యాచ్‌లకు రావడం లేదన్న హస్సీ**

**తాను స్టేడియానికి వస్తే కెమెరాలు, అభిమానుల దృష్టి జట్టుపై కాకుండా తనపై ఉంటుందని ధోనీ భావన**

**ప్రస్తుతం పిక్క గాయంతో బాధపడుతున్న ధోనీ.. కోలుకునే దశలోనే ఉన్నాడన్న బ్యాటింగ్ కోచ్**

**మ్యాచ్‌లకు రాకపోయినా ట్రైనింగ్‌లో పాల్గొంటూ ఆటగాళ్లలో ధోనీ ఆత్మవిశ్వాసం నింపుతున్నాడని వెల్లడి**



**చెన్నై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఆడుతున్న మ్యాచ్‌లకు ఆ జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఎందుకు హాజరు కావడం లేదనే సస్పెన్స్‌కు తెరపడింది. ప్రస్తుతం పిక్క గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ, ప్రాక్టీస్ సెషన్లలో కనిపిస్తున్నప్పటికీ.. మ్యాచ్‌ల రోజున మాత్రం స్టేడియంలో ఎక్కడా కనిపించడం లేదు. దీని వెనుక ఉన్న అసలు కారణాన్ని సీఎస్‌కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ వెల్లడించాడు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ధోనీ ఈ నిర్ణయం తీసుకున్నాడని ఆయన స్పష్టం చేశాడు.

"ధోనీ ఎప్పుడూ జట్టు గురించే ఆలోచిస్తాడు. జట్టు ప్రయోజనాలకే అతను పెద్దపీట వేస్తాడు. తాను స్టేడియానికి వస్తే, అది జట్టుకు ఒకరకమైన డిస్ట్రాక్షన్ అవుతుందని అతను ఆందోళన చెందాడు. తాను వస్తే కెమెరాలన్నీ తనపైనే ఉంటాయని, అభిమానుల దృష్టి కూడా ఆటగాళ్ల ప్రదర్శనపై కాకుండా తనవైపే మళ్లుతుందని ధోనీ భావించాడు. అందుకే జట్టు ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ పని తాము చేసుకునేలా ఉండేందుకే మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు" అని వివరించాడు. ఈ నిర్ణయం సరైనదా? కాదా? అని చెప్పేది తాను కాదని, కానీ ధోనీ ఆలోచన మాత్రం ఇదేనని హస్సీ తెలిపాడు.

అయితే, ధోనీ మ్యాచ్‌లకు దూరంగా ఉన్నా.. ఇంటి నుంచే ప్రతీ మ్యాచ్‌ను నిశితంగా గమనిస్తున్నాడని హస్సీ అన్నాడు. "అతను ఇంటి దగ్గర ఉండి మ్యాచ్‌లను చాలా క్షుణ్ణంగా చూస్తున్నాడు. నిజానికి ధోనీ డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటం నాకిష్టం. అతని జ్ఞానం, అనుభవం ఆటగాళ్లలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

## మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టును
# ప్రకటించిన బీసీసీఐ

**సంచలన పేసర్‌కు తొలి అవకాశం!**

**గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగి వచ్చిన యాస్తిక భాటియా**

**స్పిన్నర్ రాధా యాదవ్‌కు మళ్లీ చోటు**

**డబ్ల్యూపీఎల్‌లో రాణించిన యువ పేసర్ నందిని శర్మకు తొలిసారి అవకాశం**

**జూన్ 14న పాకిస్తాన్‌తో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది**



**న్యూఢిల్లీ:** జూన్ 12 నుంచి జరగనున్న 2026 మహిళల టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ గా, స్మృతి మంధన వైస్ కెప్టెన్ గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో వికెట్ కీపర్ యాస్తిక భాటియా, స్పిన్నర్ రాధా యాదవ్ పునరాగమనం చేయగా, డబ్ల్యూపీఎల్‌లో సత్తా చాటిన యువ ఫాస్ట్ బౌలర్ నందిని శర్మకు అనూహ్యంగా తొలిసారి అవకాశం దక్కింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, చీఫ్ సెలక్టర్ అమితా శర్మ ఈ వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.


మోకాలి శస్త్రచికిత్స కారణంగా 2025 వన్డే ప్రపంచకప్‌కు దూరమైన యాస్తిక భాటియా, పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చింది. గత ఏడాది ఇంగ్లండ్ సిరీస్‌లో రాణించిన రాధా యాదవ్ కూడా స్క్వాడ్‌లో చోటు దక్కించుకుంది. ఇక, డబ్ల్యూపీఎల్ 2026లో హ్యాట్రిక్ సాధించి సంచలనం సృష్టించిన నందిని శర్మ, జట్టు పేస్ బౌలింగ్‌ను బలోపేతం చేయనుంది. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు అమన్‌జోత్ కౌర్ (వెన్నునొప్పి), కష్వీ గౌతమ్ (మోకాలి గాయం) దూరం కావడంతో నందినికి ఈ అవకాశం లభించింది. తెలుగమ్మాయిలు శ్రీ చరణి, అరుంధతిరెడ్డి కూడా వరల్డ్ కప్ జట్టుకు ఎంపికయ్యారు.

జూన్ 12 నుంచి జులై 5 వరకు జరగనున్న ఈ వరల్డ్ కప్ టోర్నీలో భారత్ గ్రూప్ 1లో ఉంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది. జూన్ 14న పాకిస్థాన్‌తో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. 2020లో రన్నరప్‌గా నిలిచిన భారత్, ఈసారి ఎలాగైనా కప్ గెలవాలనే పట్టుదలతో ఉంది. ఈ ప్రపంచకప్ కంటే ముందు, మే 28 నుంచి జూన్ 2 వరకు ఇంగ్లండ్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌లో కూడా ఇదే జట్టు ఆడనుంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), నందిని శర్మ, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్.

MOVIE TIME

# ఐ, నోబడీ.. టీజర్ విడుదల




**టాకీస్:** మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది.

# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు



**టాకీస్:** రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్లు తెలుస్తోంది.




# చాలా ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది

## హీరోయిన్ సదా

**టాకీస్:** హీరోయిన్ సదా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది సదా. తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేసింది. ఒకప్పుడు వరుస సినిమాలతో అలరించిన సదా ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. నటి సదా తన ఇన్నేళ్ల ఏళ్ల సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవితం,అలాగే చిత్ర పరిశ్రమలో ఎదురైన సవాళ్ళ గురించి ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తన కెరీర్‌లో జయం, అపరిచితుడు, అన్నదమ్ములు వంటి అనేక విజయవంతమైన చిత్రాలలో నటించినప్పటికీ, తన ప్రతిభకు తగిన గుర్తింపు లభించలేదని అభిమానులు భావించడంపై ఆమె స్పందించారు. ఈ ప్రశ్న తనను కూడా తరచుగా వేధిస్తుందని, దీనికి సమాధానం దొరకలేదని, కొన్ని విషయాలు మన నియంత్రణకు అతీతంగా ఉంటాయని సదా అన్నారు. నటి సదా తన ఇన్నేళ్ల ఏళ్ల సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవితం,అలాగే చిత్ర పరిశ్రమలో ఎదురైన సవాళ్ళ గురించి ఒక ఇంటర్వ్యూలో ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తన కెరీర్‌లో జయం, అపరిచితుడు, అన్నదమ్ములు వంటి అనేక విజయవంతమైన చిత్రాలలో నటించినప్పటికీ, తన ప్రతిభకు తగిన గుర్తింపు లభించలేదని అభిమానులు భావించడంపై ఆమె స్పందించారు. ఈ ప్రశ్న తనను కూడా తరచుగా వేధిస్తుందని, దీనికి సమాధానం దొరకలేదని, కొన్ని విషయాలు మన నియంత్రణకు అతీతంగా ఉంటాయని సదా అన్నారు. జయం వంటి భారీ విజయం తర్వాత కూడా ఆఫర్లు రావడంలో జాప్యం జరిగిందని ఆమె గుర్తు చేసుకున్నారు. ముంబైలో నివసించడం, పరిశ్రమలో గాడ్‌ఫాదర్ లేకపోవడం, అప్పట్లో సోషల్ మీడియా అందుబాటులో లేకపోవడం వంటివి దీనికి కారణాలని సదా చెప్పుకొచ్చింది. జయం తనకు చాలా పెద్ద అదృష్టమని, దర్శకుడు తేజ తనను చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడం గొప్ప విషయమని ఆమె పేర్కొన్నారు. అయితే, సినిమా నేపథ్యంలో లేని కారణంగా, నటన వృత్తి ఎంతవరకు నిలబడు తుందో అనే అనుమానంతో జయం తర్వాత తాను తిరిగి తన ఐటీ చదువును కొనసాగించానని సదా తెలిపారు. కొన్ని నెలలు విరామం తీసుకొని చదువుపై దృష్టి సారించానని, నటన ఒక్కటే ఆధారపడద గినది కాదని అప్పట్లో భావించానని చెప్పారు. జయం, అపరిచితుడు చిత్రాలు ఎంత పెద్ద విజయాలు సాధించాయో అప్పట్లో తనకు పూర్తిగా తెలియదని, ఇప్పుడు ఆ గొప్పదనం అర్థమవుతోందని అన్నారు. డాన్స్ షోలో మూడు సంవత్సరాలు జడ్జిగా వ్యవహరించిన తర్వాత, పునరావృతం అనిపించడంతో విరామం తీసుకున్నాని, ప్రస్తుతం తాను తిరిగి ఎప్పుడు వస్తానో చెప్పలేనని అన్నా రు. ఇటీవల రా రా అను పాటను నితిన్ సినిమాలో రీమేక్ చేయడంపై సదా స్పందించారు. ఆ పాట రీమేక్ చాలా బాగుందని, మంచి ఫ్లేవర్ ఇచ్చారని ప్రశంసించారు. అయితే, ఆ పాట కోసం తనను సంప్రదిం చారని వచ్చిన వార్తలను ఖండించారు. తనను ఎవరూ సంప్రదిం చలేదని తెలిపారు. చాలా ప్రాజెక్టులు తన వరకు రాకుండా మధ్యలోనే ఆగిపోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందని, తన నెంబర్ చాలా మందికి అందుబాటులో ఉన్నప్పటికీ ఇలా జరుగుతుందని ఆమె అన్నారు. రెండు మూడు సంవత్సరాలు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, తిరిగి వచ్చినప్పుడు ప్రేక్షకులు తనను అదే ప్రేమతో ఆదరి స్తున్నారని సదా సంతోషం వ్యక్తం చేశారు.

# 'పోలీస్ కంప్లైంట్'.. మే 22న గ్రాండ్ రిలీజ్

**టాకీస్:** వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర వంటి ప్రతిభావంతులైన నటీనటుల కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'పోలీస్ కంప్లైంట్' మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా హారర్ మరియు యాక్షన్ థ్రిల్లర్ అంశాల కలబోతగా రూపొందడం విశేషం. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ఇచ్చింది. చిత్రంలో కీలక పాత్ర పోషించిన నటుడు కృష్ణసాయి పుట్టినరోజును పురస్కరించుకుని, దివంగత సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ఒక ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగుతూనే, ప్రేక్షకులకు వెన్నులో వణుకు పుట్టించే హారర్ ఎలిమెంట్స్ ఇందులో పుష్కలంగా ఉండబోతున్నాయి. గతంలో 'ఆదిపర్వం', 'రాఘవరెడ్డి', 'అఘోర' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న సంజీవ్ మేగోటి, ఈసారి పోలీస్ కంప్లైంట్ సినిమాతో మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణ నటీనటుల ఎంపిక. వరలక్ష్మి శరత్‌కుమార్ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో సరికొత్త షేడ్స్ చూపించనుండగా, వెర్సటైల్ హీరో నవీన్ చంద్ర ఒక విభిన్నమైన రోల్‌లో మెరవబోతున్నారు. వీరిద్దరి మధ్య సాగే డ్రామా సినిమాకు ప్రధాన బలంగా నిలవనుంది. కేవలం ప్రధాన జంట మాత్రమే కాకుండా, ఈ చిత్రంలో ఏకంగా 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటించడం విశేషం. రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్ వంటి అనుభవజ్ఞులైన నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. భారీ తారాగణం ఉండటం వల్ల సినిమాలోని ప్రతి సన్నివేశం చాలా గ్రాండ్‌గా, పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది.



# ఫ్యాన్స్ నుంచి డబ్బులు గుంజడం సరికాదు

## దర్శకుడు రవిబాబు సంచలన కామెంట్స్

**టాకీస్:** వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ . ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు



పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.

# జూన్ 26న లెనిన్ విడుదల

**టాకీస్:** 'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతుందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.